మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 141 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 19 ఏప్రిల్ 2026 | పేజీలు : 4





భూముల మార్కెట్ విలువ పెంచుతాం 4




# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన్రు

## .. అయినా పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు

- **ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు**
- **రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే : హరీశ్‌రావు**
- **రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యాయి : కేటీఆర్**
- **జగిత్యాలలో కేసీఆర్ సభ ఏర్పట్లు పరిశీలన**



జగిత్యాల, మన చౌరాస్తా : బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బతీసిన ఎంపీ విషయంలో బీఆరఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆరఎస్ ఎంపీ లు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ ` పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్ లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆరఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆరఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆరఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆరఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆరఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆరఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5.30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.



ఏఎస్పీ పండరి చేతన్ నితిన్‌కు

# పదోన్నతి

## జగిత్యాల జిల్లా ఎస్పీగా బాధ్యతలు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా ఏఎస్పీ (ఐపీఎస్) పండరి చేతన్ నితిన్కు పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనగామలో సుమారు 16 నెలల పాటు ఏఎస్పీగా విధులు నిర్వహించిన ఆయన, ఇప్పుడు జగిత్యాల జిల్లాకు అడిషనల్ ఎస్పీగా వెళ్లనున్నారు. తన సేవా కాలంలో శాంతిభద్రతల పరంగా జనగామలో ప్రత్యేక ముద్ర వేసుకున్న చేతన్ నితిన్‌కు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా వరంగల్ ఏసీపీ శుభం ప్రకాశ్‌కు కూడా పదోన్నతి కల్పిస్తూ నిజామాబాద్‌లో అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా బదిలీ చేశారు.







# సంక్షేమ వారాన్ని పక్కాగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాల్లో, విద్యాలయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాల్లో మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్నీ ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాల్లో, వసతి గృహాల్లో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మతు పనులు చేపట్టాలని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించాలని, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఏఓ అంబికా సోనీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఏబీసీడీఓ రవీందర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, ఇంచార్జి డీఆర్డీఓ నూరుద్దీన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.





# రైతు బాగుంటేనే దేశం బాగుపడుతుంది

**మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్**

**జనగామ, మన చౌరాస్తా :** రైతు బాగుంటేనే దేశం బాగుపడుతుందని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. శనివారం జనగామ మండలం పసరమడ్ల , ఎల్లంల, ఎర్రకుంట తండా, ఎర్రగోల్ల పహాడ్ గ్రామాల్లో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళల ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు, రైతులకు ,మహిళలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని మాయిచ్చర్ వచ్చే విధంగా చూసుకొని సెంటర్‌కు తీసుకురావాలని తెలిపారు. రైతులు మద్దతు ధర కావాలంటే ప్రభుత్వం కేటాయించిన వడ్ల కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శంకరయ్య, ఆయా గ్రామాల సర్పంచులు మిద్దపాక ప్రియాంక కరుణాకర్, దేవునూరి సతీష్, శ్రీకాంత్ నాయక్, చిర్ర సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్, సీసీ వెంకటేశ్, స్వప్న నాయకులు శిరీష రెడ్డి, జనగాం సోమి రెడ్డి, చంద్రం గౌడ్, కృష్ణ, నారాయణ, శేఖర్ యాదవ్, మైస గౌడ్, అంజన్న, బిక్షపతి, రవి, శ్రీను, రమేష్, రాజు, ప్రవర్ధన్, సాయి పాల్గొన్నారు.



# నో హెల్మెట్.. నో ఎంట్రీ

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** జనగామ జిల్లా లింగాలగణపురం మండలం నెల్లుట్ల గ్రామంలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. హెల్మెట్ లేనిదే గ్రామంలోకి ప్రవేశం ఉండదంటూ 'నో హెల్మెట్ - నో ఎంట్రీ' అనే నిబంధనను అమలు చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు స్పష్టమైన సందేశం ఇస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల ప్రభావంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఈ నిబంధనను అమలు చేస్తున్నామని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ చర్యపై గ్రామస్థులు కూడా సానుకూలంగా స్పందిస్తూ, భద్రత కోసం ఇలాంటి నిర్ణయాలు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.






# మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ నిరసన

జనగామ, మన చౌరాస్తా : పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు అడ్డంకులు సృష్టించారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ జెండాలు పట్టుకొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ నాయకత్వం వహించారు. నిరసనలో దేవరాయ ఎల్లయ్య (జిల్లా ఉపాధ్యక్షుడు), తోకల ఉమారాణి (జిల్లా ప్రధాన కార్యదర్శి), బొమ్మకంటి అనిల్ (జనగామ పట్టణ అధ్యక్షుడు), పెద్దోజు జగదీష్ (పట్టణ ప్రధాన కార్యదర్శి), చింతకింది సంతోష్ (బీజేవైఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు) తదితరులు పాల్గొన్నారు.

# దేవరుప్పులలో మాజీ మంత్రి పర్యటన

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు రైతు సమస్యలు, నిరుద్యోగ యువత ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎర్రబెల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వడ్లు కొనుగోలు ఆలస్యం కావడంతో ఆందోళన వ్యక్తం చేసిన రైతుల సమస్యపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి కొనుగోళ్లు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (NECC) సహకారంతో 23 మంది యువతకు ఎగ్ కార్ట్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యమని ఎర్రబెల్లి తెలిపారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, తీగల దయాకర్ గౌడ్, బస్వ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. రైతులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.







# ‘పట్టు’ రైతుల నిలువు దోపిడీ

- **పట్టుగూళ్ల ధరల తగ్గింపుపై ఆగ్రహం**
- **జనగామలో ధర్నా**




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ పట్టు పరిశ్రమల శాఖ కార్యాలయం వద్ద పట్టుగూళ్ల ధరలు తగ్గించడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన రైతులు శనివారం వరంగల్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. సిద్దిపేట, వరంగల్, సూర్యాపేట, కరీంనగర్, కంభం, పెద్దపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 30 మంది రైతులు తమ పట్టుగూళ్లను విక్రయించేందుకు జనగామ మార్కెట్‌కు తీసుకువచ్చారు. రైతుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా హిందూపూర్‌లో క్వింటాల్ పట్టుగూళ్ల ధర సగటున రూ.670 ఉండగా జనగామలో వ్యాపారులు కిలోకు రూ.550 మాత్రమే ఇస్తామని చెప్పడం వివాదానికి దారితీసింది. కిలోకు రూ.120 తగ్గించడం అన్యాయమని రైతులు వ్యాపారులను ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. రెండు ఎకరాల్లో పట్టు సాగు చేయడానికి నెలకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చవుతుందని, కానీ సుమారు 100 కిలోల దిగుబడి మాత్రమే వస్తుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ధరలు తగ్గించడం వల్ల పెట్టుబడులు కూడా రాకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయని రైతులు పి.దుర్గారెడ్డి, ఐలయ్య, శ్రీనివాస్, రామస్వామి, రమేష్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవిందరాజు, అశోకు, పుల్లయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల కష్టం చేసినా లాభం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రైతులు పట్టుగూళ్లతో రహదారిపైకి దిగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వ్యాపారులు క్వింటాల్‌కు రూ.30 పెంచుతామని సూచించగా, రైతులు కనీసం రూ.50 పెంచాలని డిమాండ్ చేశారు. చర్చలు ఫలించకపోవడంతో రైతులు సుమారు గంట పాటు ధర్నా కొనసాగించారు. ఈ ఘటనతో పట్టుగూళ్ల ధరల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతోంది. అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ మద్దతు

- **బీజేపీ కుట్రలతోనే బిల్లు ఆగిపోయింది**
- **టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్**



**జనగామ, మన చౌరాస్తా :** పార్లమెంట్‌లో చోటుచేసుకున్న పరిణామాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని రాష్ట్ర పీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. శనివారం జనగామలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్యతో కలిసి మాట్లాడారు. మహిళా సాధికారతకు సంబంధించిన చట్టాలు, డీలిమిటేషన్ బిల్లు అంశాలను ఒకదానితో ఒకటి లింక్ చేయడం ద్వారా రాజ్యాంగ సవరణల విషయంలో అనవసరమైన రాజకీయ కుతంత్రాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశంలో సగభాగం ఉన్న మహిళలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కాకుండా బీసీ లకు ప్రాధాన్యత కల్పించకుండా బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. మహిళల గౌరవానికి సంబంధించిన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం తగదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. 2023లో ఆమోదం పొందిన మహిళా బిల్లును తిరిగి వివాదాస్పదంగా ముందుకు తేవడం పట్ల కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని వర్గాల న్యాయమైన హక్కుల కోసం ఎప్పటికీ పోరాడుతుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో సమానత్వం, సమృద్ధి సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియలో బీసీలకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వకుండా అన్యాయం జరుగుతోందని, అలాగే మహిళలలో కూడా బీసీ మహిళలకు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ కులగణన చేసి తాము దేశానికి రోల్ మోడల్‌గా నిలిచామని తెలిపారు. బీజేపీ నాయకులు తెలంగాణపై విభిన్న వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో వారి వైఖరి స్పష్టతలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని అవమానించే విధంగా ప్రవర్తిస్తున్న బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



## లక్ష్మీతండాలో భవన నిర్మాణ కార్మిక సంఘం

# నూతన కమిటీ ఏర్పాటు

**జనగామ, మన చౌరాస్తా :** భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (TBNRKS) రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రన్న ఆదేశాల మేరకు రఘునాథపల్లి మండలం లక్ష్మీతండాలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య హాజరై కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ తుడీ అంజయ్య, జిల్లా కోకన్వీనర్ ఇల్లెందుల భిక్షపతి పాల్గొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బానోతు మహేందర్, ఉపాధ్యక్షుడిగా బానోతు రవి, ప్రధాన కార్యదర్శిగా బాదావత్ మోహన్, ఉప కార్యదర్శిగా భానోతు లింగం, కోశాధికారిగా ధరావత్ మహేందర్, గౌరవ అధ్యక్షుడిగా కాలు రామ్ నాయక్, ప్రచార కార్యదర్శిగా బానోతు సొమ్లు, గౌరవ సలహాదారులుగా బానోతు మోతిలాల్, లాకవత్ బాలు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.




# జిల్లా ఆసుపత్రిలో అన్నప్రసాద వితరణ

**జనగామ, మన చౌరాస్తా :** యాదాల షారోన్ , సాషా అమెరికా వాస్తవ్యులు జిల్లా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ మహా అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణే లక్ష్యంగా ప్రజలు దాతలు వారి పుట్టినరోజు వేడుకల సందర్భంగా మానవ దృక్పథంతో మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం అనే చాటుకుంటున్నారని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు సిద్ధిరాల చందు, బుస్సా సంపత్, ఎండి అఫ్రోజ్, వై.ప్రణీత్, బొల్లం కనకరాజు, పిట్టల కృష్ణ, గోల్కొండ మహేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

### చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ వద్ద..

జనగామ జిల్లా కేంద్రంలో యాదాల షారోన్, సాషా అమెరికా వాస్తవ్యులు మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామ చెంపకిల్స్ హాస్పిటల్ దగ్గర అన్నదానం చేశారు. కార్యక్రమంలో మేము సైతం ఫౌండేషన్ ఫౌండర్ తుంగ కౌశిక్, నీలం శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

- ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు
- పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు
- ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు.ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమీషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ`భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## మహిళలను ఏకం చేస్తాం : ఎంపీ లక్ష్మణ్

**న్యూఢిల్లీ, మన చౌరాస్తా :** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. 'మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్ లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**